

బడివడిగా ప్రయోగాలు

భారత శాస్త్రవేత్త సీవీ రామన్ ఎఫెక్ట్‌ను ప్రకటించిన ఫిబ్రవరి 28వ తేదీని ఏటా జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం.


8లో



పోలీసులకే రక్షణ కరవు

ప్రజలను కాపాడాల్సిన రక్షక భటులకే కూటమి ప్రభుత్వ పాలనలో రక్షణ కరవైందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు.

డెల్టాలకు 8,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పీఏటీ పాస్ సర్టిఫికెట్లు రెడీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా గత ఏడాది మార్చిలో జరిగిన ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ (పీఏటీ) పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి పాస్ సర్టిఫికెట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన వారు తమ హాల్ టికెట్లతో శుక్రవారం నుంచి తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

వసతి గదుల కార్యాలయం వద్ద ఫ్రీ వైఫై

అన్నవరం: జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఇటీవల అన్నవరం దేవస్థానంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సందర్భంగా డిజిటల్ పేమెంట్లకు ఫ్రీ వైఫై సదుపాయం కల్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రత్నగిరిపై వసతి గదుల కార్యాలయంలో అధికారులు ఫ్రీ వైఫై ఏర్పాటు చేసి, డిజిటల్ పేమెంట్లకు అవకాశం కల్పించారు. ఆ కార్యాలయం వద్దకు వచ్చిన వెంటనే సెల్‌ఫోన్‌లో వైఫై ఆన్ చేయగానే సీఆర్ఓ రూముల బుకింగ్ అని వస్తుంది. దానిపై క్లిక్ చేయగానే వైఫై ఆన్ అవుతుంది. తద్వారా సత్యదేవుని సన్నిధిలో ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపుల ద్వారా వసతి గదులు పొందే అవకాశం భక్తులకు కలిగింది.

వాట్సాప్ గవర్నెన్స్‌లో రిఫండ్ ఆప్షన్

అన్నవరం: సత్యదేవుని సన్నిధి సహా ఇతర దేవస్థానాల్లో వాట్సాప్ నంబర్ 95523 00009 ద్వారా మన మిత్ర పేరుతో అమలు చేస్తున్న వాట్సాప్ గవర్నెన్స్‌లో రిఫండ్ ఆప్షన్‌ను కూడా చేర్చారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గురువారం అన్ని దేవస్థానాలకూ సర్క్యులర్ జారీ చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా దేవస్థానాల్లో వివిధ సేవలు, దర్శనాల టికెట్లు కొనుగోలు చేసిన కొనుగోలు చేసిన భక్తులకు ఏ కారణంతోనైనా వారి అకౌంట్ నుంచి నగదు కట్ అయి, టికెట్ రాకుంటే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించనున్నారు. ఇప్పటి వరకూ వాట్సాప్ గవర్నెన్స్‌లో ఈ ఆప్షన్ లేదు. నగదు కట్ అయి టికెట్లు రాని వారు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా సేవల టికెట్లు లేదా విరాళాల రశీదులు రాకపోతే భక్తులు ఆయా దేవస్థానాల్లోని హెల్ప్ డెస్క్ లేదా కాంటాక్ట్ పాయింట్‌లో ఫిర్యాదు చేయాలి. నగదు చెల్లించినట్లు ఆధారాలు చూపాలి. ఆ వివరాలను వాట్సాప్ గవర్నెన్స్ నిర్వహిస్తున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు పంపిస్తారు. బ్యాంకు పరిశీలన, నిర్ధారణ అనంతరం ఆ నగదును ఆ భక్తుని అకౌంట్‌కు జమ చేస్తారు. ఎటువంటి అవకతవకలకు ఈ మొత్తం వ్యవహారాన్ని రికార్డు చేయాలని, ఆడిట్ సమయంలో ఆడిట్ అధికారులకు సమర్పించాలని కమిషనర్ సూచించారు.

పీఠంలో లింగోద్భవ పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ పూజలు నిర్వహించారు. పీఠంలో ఉన్న ఎనిమిది ఈశ్వర బాణాలకు రాత్రి 11గంటల నుంచి శివుడు లింగరూపంలో ఉద్భవించిన సమయం వరకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అభిషేకం, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. వేద పండితులు చీమలకొండ వీరావధాని, శ్రీనివాసావధానులు, తోలేటి నాగేంద్రశర్మ, చక్రవర్తుల మాధవాచార్యులు తదితర 18 మంది వేద పండితులు ఈ పూజలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి లింగోద్భవ పూజలను వీక్షించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, సోమేశ్వరంలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్త్యేశ్వర స్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వర స్వామి, వెదురుపాక పార్వతీ సమేత సోమేశ్వర స్వామి, మాచవరంలో భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి, పసలపూడిలో రాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో లింగోద్భవ పూజలు భక్తుల శివనామస్మరణ నడుమ పురోహితులు నిర్వహించారు.

కొబ్బరి శాస్త్రవేత్తలకు టీమ్ అవార్డు

అంబాజీపేట: వివిధ పంటలపై ఆశించే పురుగులు, తెగుళ్ల సమర్థ నివారణకు జీవ నియంత్రణ పద్ధతుల వినియోగంపై స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్తలకు టీమ్ అవార్డు లభించినట్టు కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్.బి.వి.చలపతిరావు తెలిపారు. ఈ మేరకు గురువారం బెంగళూరులో జరిగిన రెండవ అంతర్జాతీయ జీవ నియంత్రణ సమావేశంలో ఈ అవార్డును ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చర్ ఇన్సెక్ట్స్ రీ సోర్సెస్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. ఎస్.సుశీల్, పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర్ చలపతిరావుకు ప్రదానం చేశారు. కొబ్బరి, కోకో, పంటలపై పురుగులు, తెగుళ్లను జీవ నియంత్రణ పద్ధతులలో నివారిస్తూ, బదనికలను అధిక సంఖ్యలో ఉత్పత్తి చేసి రైతులకు పంపిణీ చేసినందుకు ఈ అవార్డు లభించినట్లు చలపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికాకు చెందిన ఇతర పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి



నల్లజర్లలో పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు



పెరవలిలో సాయంత్రం 4 గంటల సమయానికి క్యూలో ఉన్న ఓటర్లు

మందకొడిగా మొదలై..

- ముగిసిన పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలు
- జిల్లావ్యాప్తంగా 92 కేంద్రాల్లో నిర్వహణ
- ఉదయం 8 గంటలకే ప్రారంభం

సాక్షి, రాజమహేంద్రవరం: శాసన మండలి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటలకు మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా ఊపందుకుంది. సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. ఆ సమయానికి క్యూలో ఉన్న వారికి స్లిప్పులు ఇచ్చి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని అనుసంధానం చేస్తూ కలెక్టరేట్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వెబ్ కాస్టింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఎన్నికలకు 400 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శ్రీ శ్యామలాంబ స్పెషల్ మునిసిపల్ స్కూల్ పోలింగ్ కేంద్రం 69లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట బందోబస్తు నడుమ రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముకు తరలించారు.

కూటమి నేతల కుయుక్తులు

ఎన్నికల్లో కూటమి నేతలు కుయుక్తులు ప్రదర్శించారు. రాజమహేంద్రవరం వీరభద్రపురంలోని పోలింగ్ బూత్ నంబర్ 56లో బరి తెగించారు. ఓటర్లకు స్లిప్‌తో పాటు కూటమి అభ్యర్థి పోటీ చేసే నంబర్ ఉన్న కరపత్రాలు ఇచ్చి గెలిపించాలని కోరారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో వారు అక్కడి నుంచి ఉడాయించారు. ఇదిలా ఉండగా, ఈ ఎన్నికల్లో టీడీపీ పోలింగ్ బూత్‌లను ఆక్రమించుకుని అక్రమాలకు పాల్పడిందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. పోలీసుల సహకారంతో బూతులను ఆక్రమించుకుని మరీ కూటమి అభ్యర్థికి ఓటు వేయాలంటూ ప్రచారం చేశారంటే టీడీపీ అక్రమాలు ఏ స్థాయికి చేరాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ ఎన్నికల్లో హర్షకుమార్ తనయుడు సుందర్ కూడా పోటీ చేసిన విషయం తెలిసిందే.

ఎవరి ధీమా వారిది

పోలింగ్ సరళిని బట్టి అభ్యర్థులు, వారి మద్దతుదార్లు ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా కూటమి మద్దతుతో బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖరం, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్యనే జరిగినట్లు అంచనా వేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ సహా ఊరూవాడా అనేక హామీలతో కూటమి నేతలు ఊదరగొట్టారు. గద్దెనెక్కి తొమ్మిది నెలలవుతున్నా వాటిని అమలు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఈ తరుణంలో వచ్చిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులైన ఓటర్లు వివేకంతో కూటమికి వ్యతిరేకంగా ఓటు వేశారని పలు ప్రజాసంఘాల నేతలు లెక్కలు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని వారు చెబుతున్నారు. గ్రామ, వార్డు వలంటీర్లు, ఆశా వర్కర్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు చెందిన ఓటర్లు పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులుకే జై కొట్టాయని అంటున్నారు. ఈ వర్గాల ఓటింగ్ అంతా గంపగుత్తగా ఆయనకే పడిందని పోలింగ్ అనంతరం ఆయా వర్గాలు ధీమాగా చెప్పాయి. గత ఎన్నికల సరళిని చూసినా.. తమ అభ్యర్థిదే విజయమని వారు ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. కాగా, కూటమి మద్దతుతో పోటీ చేసిన పేరాబత్తుల రాజశేఖరం వర్గీయులు కూడా తమ అభ్యర్థి గెలుస్తారని చెబుతున్నారు. తెరచాటుగా సాగించిన ప్రలోభాలు, డబ్బు, అధికారం అండతో తమ గెలుపు ఖాయమని ధీమాగా చెబుతున్నారు. ఎవరి భవితవ్యం ఏమిటనేది వచ్చే నెల 3న జరిగే ఓట్ల లెక్కింపులో తేలనుంది.



రాజమహేంద్రవరం వీరభద్రపురంలోని సిటీ మున్సిపల్ హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు



ఓటు వేసిన జేసీ చిన్నరాముడు



టీడీపీ నేతలు పంచిన కరపత్రాలు

జిల్లాలో పోలింగ్ వివరాలు

మొత్తం ఓటర్లు	62,970
పోలైన ఓట్లు	42,446
పోలింగ్ శాతం	67.41

నియోజకవర్గాల వారీగా అనపర్తిలో 73.36 శాతం, రాజానగరం 60.27, రాజమండ్రి రూరల్ 76.32, రాజమండ్రి సిటీ 63.22, జగ్గంపేట 79.99, కొవ్వూరు 66.37, నిడదవోలు 75.72, గోపాలపురం 63.72 శాతం చొప్పున ఓటింగ్ జరిగింది.

అరెస్టులు కక్ష సాధింపే

- ప్రభుత్వ వైఫల్యాల నుంచి డైవర్షన్‌కే వైఎస్సార్ సీపీ నేతల అక్రమ అరెస్టులు
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఫైర్



జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: నెల రోజుల వ్యవధిలో వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని, సినీ నటుడు పోసాని కృష్ణమురళీని అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆరోపించారు. తొమ్మిది నెలలుగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి మహిళలను సైతం బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఆరోగ్యం బాగా లేదని చెప్పినా లెక్క చేయకుండా అధికారం ఉంది కదా ఏం చేసినా చెల్లుతుందన్న ధోరణిలో వైఎస్సార్ సీపీ తరఫున గొంతు కలిపిన ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతున్నారని ఆక్షేపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ఘోర వైఫల్యం చెందారని, దాని నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకు నిత్యం ఏదో ఒక అంశాన్ని వెతుక్కుని దానిపై ఓ రెండు వారాల పాటు నడిపించడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. కొత్త బడ్జెట్ ప్రజారంజకంగా లేదని, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం తెర లేపిన కొత్త సంస్కృతి, సంప్రదాయంతో రేపు మళ్లీ అదే బోనులో వారు కూడా నిలబడాల్సి ఉంటుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం చేసే ప్రతి అరాచకాన్నీ ప్రజలు గమనిస్తున్నారని, ప్రభుత్వం మీద ప్రజల్లో ఇంత తీవ్రమైన స్థాయిలో వ్యతిరేకత ఎప్పుడూ చూడలేదని అన్నారు. గద్దెనెక్కించిన ప్రజలే ప్రభుత్వాన్ని గద్దె దించే కార్యక్రమం చేస్తారని.. ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని రాజా స్పష్టం చేశారు.

నేడు సివిల్ సర్వీసెస్ హాకీ ఫైనల్స్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆలిండియా సివిల్ సర్వీసెస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డు పర్యవేక్షణలో జిల్లా క్రీడా మండలి ఆధ్వర్యాన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల హాకీ పోటీల ఫైనల్స్ శుక్రవారం జరగనుంది. గురువారం మహిళల సెమీ ఫైనల్స్‌లో ఒడిశా – ఆంధ్రప్రదేశ్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 6–0 స్కోర్‌తో, సెంట్రల్ సెక్టార్ – హర్యానా మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్టార్ 6–0 స్కోర్‌తో విజయం సాధించి, ఫైనల్స్‌కు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో సెంట్రల్ సెక్టార్ – ఒడిశా మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్టార్ 8–2 స్కోర్‌తో, ఆర్ఎస్‌బీ హైదరాబాద్ – హర్యానా సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్‌బీ హైదరాబాద్ 5–0 స్కోర్‌తో విజయం సాధించి ఫైనల్స్‌లో చోటు దక్కించుకున్నాయి. జిల్లా క్రీడా మైదానంలో జరిగే ముగింపు ఉత్సవానికి భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్, ఒలింపియన్ ధనరాజ్ పిళ్లై, కలెక్టర్ షణ్మోహన్, ఇన్‌కమ్‌ట్యాక్స్ డైరెక్టర్ జనరల్ అతిథులుగా హాజరు కానున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై సందిగ్ధత

- రత్నగిరిపై కొలిక్కిరాని వ్యవహారం
- నేటితో ముగియనున్న కేఎల్‌టీఎస్ కాంట్రాక్ట్
- తాత్కాలికంగా కొత్త ఏజెన్సీ ఎంపిక
- అయినా తొలగని గందరగోళం



అన్నవరం దేవస్థానం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ కాంట్రాక్ట్ శుక్రవారంతో ముగియనుంది. తాత్కాలికంగా కొత్త ఏజెన్సీకి ఈ పనులు అప్పగించగా.. దీనికి అవసరమైన మెషీన్లు, ఇతర సామగ్రి వంటివి సమస్యగా మారుతోంది. దీంతో వ్యవహారం కొలిక్కిరాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. అన్నవరం దేవస్థానంలో కేఎల్‌టీఎస్ సంస్థ రెండేళ్లుగా శానిటరీ విధులు నిర్వహిస్తోంది. గత ఏడాది నవంబర్ నెలతోనే ఈ సంస్థ కాంట్రాక్ట్ గడువు ముగిసింది. ఈ పరిస్థితుల్లో టెండర్ ద్వారా కొత్త సంస్థను ఎంపిక చేసేంత వరకూ ఈ విధులు నిర్వహించాలని కేఎల్‌టీఎస్ సంస్థను దేవస్థానం కోరింది. దీంతో ఆ సంస్థ సిబ్బంది ఈ నెలాఖరు వరకూ ఆ పనులు నిర్వహించారు. మార్చి 1 నుంచి తాము ఆ విధులు నిర్వహించలేమని ఆ సంస్థ దేవస్థానానికి లేఖ సమర్పించింది. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఈ నెల 14న విజయవాడలో కలిసి, పరిస్థితి వివరించారు. ఈ నేపథ్యంలో మార్చి 1 నుంచి నెల రోజుల పాటు దేవస్థానంలో శానిటరీ పనులకు అవసరమైన సిబ్బంది సరఫరాకు గుంటూరుకు చెందిన కనకదుర్గా శానిటరీ సర్వీసెస్ సంస్థను తాత్కాలికంగా ఎంపిక చేశారు.

మెటీరియల్, మెషీనరీ సమస్య

పారిశుద్ధ్య సిబ్బంది సరఫరాకు ఏజెన్సీని ఎంపిక చేసినప్పటికీ, ఫినాయిల్, యాసిడ్, ఇతర లిక్విడ్స్ వంటి శానిటరీ మెటీరియల్ కొనుగోలు సమస్యగా మారింది. ఇప్పటి వరకూ కేఎల్‌టీఎస్ సంస్థే వీటన్నింటినీ సరఫరా చేసి, పనులు నిర్వహించేది. ఆ పనులు సరిగ్గా లేకపోతే దేవస్థానం మరోసారి చేయించేది. ఇప్పుడు నాణ్యమైన శానిటరీ సామగ్రిని దేవస్థానమే కొనుగోలు చేయాల్సి ఉంది. అలాగే, ఆలయ ఆవరణను కడగడానికి అవసరమైన మెషీన్లు కేఎల్‌టీఎస్ సంస్థ వద్దనే ఉన్నాయి. ఆ సంస్థ వాటిని తీసుకుని వెళ్లిపోతే పరిస్థితేమిటనే మీమాంస అధికారుల్లో నెలకొంది. నిత్యం వేలాదిగా భక్తులు వచ్చే అన్నవరం దేవస్థానంలో 24 గంటలూ పారిశుధ్యం, సత్రాల్లో హౌస్ కీపింగ్, ఆలయ ప్రాంగణంలో శుభ్రత తదితర పనులు నిరంతరాయంగా జరగాల్సి ఉంది. ఒక్క రోజు ఈ పనులు ఆగిపోయినా భక్తులకు ఇబ్బంది తప్పదు. ఈ పరిస్థితిని కమిషనర్‌కు వివరించామని, ఆయన నుంచి ఆదేశాలు వచ్చేంత వరకూ శానిటరీ మెటీరియల్, మెషీనరీని తీసుకుని వెళ్లవద్దని కేఎల్‌టీఎస్ సంస్థ కాంట్రాక్టర్‌ను కోరామని దేవస్థానం అధికారులు చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలోని ఏడు దేవస్థానాలను ఒకే యూనిట్‌గా రెండేళ్లకు శానిటరీ టెండర్ పిలుస్తారని, అప్పటి వరకూ తాత్కాలిక ఏర్పాట్లు తప్పవని తెలిపారు. ఈ విషయంలో కలెక్టర్ షణ్మోహన్ జోక్యం చేసుకుంటే తప్ప సమస్య పరిష్కారం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సూపర్ సిక్స్ ఓ బూటకం

- ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు 143
- ఒక్కటి కూడా అమలు చేయలేదు
- పథకాలు ఎగ్గొట్టడానికి ఆర్థిక వ్యవస్థ ధ్వంసమంటూ తప్పుడు ప్రచారం
- వైఎస్సార్ సీపీ నేత తలారి వెంకట్రావు



తలారి వెంకట్రావు

చాగల్లు: కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలు ఒట్టి బూటకమని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ తీరుపై ఘాటుగా విమర్శించారు. ఎన్నికల్లో కూటమి నేతలు సూపర్ సిక్స్ మాత్ర కాదని, మొత్తం 143 హామీలు ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది గడుస్తున్నా ఒక్క పథకం కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను రద్దు చేయానికి, ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఎగ్గొట్టడానికి, ఒకటీ అరా ఇచ్చినా పూర్తిగా కోతలు విధించడానికే ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంకా తలారి వెంకట్రావు ఏమన్నారంటే..

- దీపం పథకంలో భాగంగా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లని చెప్పారు. మొత్తం 1.55 కోట్ల లబ్ధిదారులుంటే 86 లక్షల మందికే ఒక్కో సిలిండర్ చొప్పున కేవలం రూ.686 కోట్లు మాత్రమే రీయింబర్స్ చేసినట్లు సాక్షాత్తూ గవర్నర్‌తోనే చెప్పించారు. తద్వారా ఈ పథకం ఎంత మోసమో తేలిపోయింది.
- డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా రిజర్వేషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారు.
- అధికారంలోకి వచ్చి ఏడాదే రైతు భరోసా, అమ్మ ఒడి రెండూ ఇవ్వలేదు. మే నెలలో అమ్మ ఒడి ఇస్తామంటున్నారు. దీనిని రెండేళ్లకూ కలిపి ఇస్తారా? ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ అనే మాట ఇప్పటికీ చెప్పడం లేదు.
- పీఎం కిసాన్ కాకుండా అన్నదాతా సుఖీభవకు రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు పీఎం కిసాన్‌తో కలిపి ఇస్తామంటున్నారు. ఏమిటీ మోసం? ఇది కూడా ఎంత మందికి ఇస్తారో, రెండేళ్లకు కలిపి ఇస్తారా అనేది వెల్లడించడం లేదు.
- అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో సాధించామని చెప్పుకొంటున్న రైల్వే జోన్‌కు కూడా భూమి ఇచ్చింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే. కూటమి వచ్చాక, ఆదాయం వచ్చే రైలు మార్గాలను, రైల్వే స్టేషన్లను ఒడిశాకు అప్పజెప్పారు. చిక్కి శల్యమైన జోన్‌ను సాధించి, ప్రజలకు ద్రోహం చేసి, దానిని కూడా గొప్పగా చెప్పుకుంటూ, అనుకూలంగా వక్రీకరించుకుంటున్నారు.
- కుటుంబాన్ని చూసుకోలేని వారు దేశాన్ని ఎలా చూసుకుంటారని గతంలో ప్రధాని నరేంద్ర మోదీని చంద్రబాబు దూషించారు. ఆయన కుటుంబాన్ని నీచంగా మాట్లాడారు. అమిత్‌షాపై తిరుపతిలో ఏకంగా రాళ్ల దాడి చేయించారు. ఇప్పుడు కాళ్లావేళ్లా పడి పొత్తు పెట్టుకున్నారు. ఇప్పుడు మళ్లీ మోదీని పొగడటం హాస్యాస్పదం.
- మధ్యాహ్న భోజనానికి మహాతల్లి డొక్కా సీతమ్మ పేరు పెట్టారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అది ఘోరమైన భోజన కార్యక్రమమైంది. రోజుకో మెనూ పోయింది. కలుషితాహార ఘటనలు నిత్యం వెలుగు చూస్తూనే ఉన్నాయి. పిల్లలు ఆస్పత్రుల్లో చేరుతున్న పరిస్థితులు రాష్ట్రంలో ప్రతి రోజూ నెలకొంటున్నాయి.
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో నిరుపేదలందరికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ వైద్యాన్ని ఉచితంగా అందించారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యతరగతి ప్రజలకు సైతం ఈ పథకాన్ని వర్తింపజేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మధ్యతరగతి వారికి చికిత్స వ్యయాన్ని రూ.2.5 లక్షలకే పరిమితం చేసింది. ఆరోగ్యశ్రీని పూర్తిగా మూసేసి, ఆరోగ్య బీమా పేరుతో వేల కోట్ల రూపాయల ప్రీమియం కొట్టేయడానికి ప్లాన్ చేశారు. దీనిని ప్రైవేటు కంపెనీలకు అప్పగించడానికి పెద్ద స్కాం చేస్తున్నారు.
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు పూర్తయిన ఇళ్లనే కూటమి ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని, పేదలకు ఇళ్ల నిర్మాణంలో ఏదో చేసేసినట్లు చెప్పేందుకు ప్రయత్నిస్తోంది. వాస్తవానికి గత ఎన్నికల నాటికే 9.02 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. అప్పటికి నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఈ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకోవడం ఆశ్చర్యకరం. వాట్సాప్‌లో సిటిజన్ సర్వీసుల సంగతేమో కానీ, హాయ్ అని కొట్టగానే వెంటనే మందు వస్తోంది.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు


- జిల్లావ్యాప్తంగా 51 కేంద్రాల్లో నిర్వహణ
- పరీక్షలు రాయనున్న 43,754 మంది విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. మార్చి 20వ తేదీ వరకూ జరిగే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి (ఆర్ఐఓ) ఎన్ఎస్‌వీఎల్ నరసింహం గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి. అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలి. తమ పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందుగానే తెలుసుకోవాలి. పరీక్షల నిర్వహణకు 51 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 51 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 17 మంది అడిషనల్ డీఓలు, 10 మంది కస్టోడియన్లతో పాటు మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. సీతానగరం, మురమండ, రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, అనపర్తి జీబీఆర్, ఎస్ఎంఆర్ కళాశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి, అక్కడ మరింత బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష ప్రారంభం నుంచి ముగిసేంత వరకూ ఆయా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను తెరవరాదని ఆదేశించారు. ఆయా విద్యార్థుల వాట్సాప్‌కు హాల్ టికెట్లు పంపించారు. వాటిని విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లవచ్చు.

పరీక్షలు రాయనున్న విద్యార్థులు

ఫస్టియర్ జనరల్	20,591
ఒకేషనల్	2,226
ద్వితీయ సంవత్సరం జనరల్	19,062
ఒకేషనల్	1,875
మొత్తం	43,754

పదవీ విరమణకు ఒక్క రోజు ముందు ఆగిన గుండె



గుండెపోటుతో మృతి చెందిన ఫైర్ ఆఫీసర్ బాలకృష్ణ

రాజోలు: ఫైర్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న భైరిశెట్టి బాలకృష్ణ (62) ఈ నెల 28న పదవీ విరమణ చేయనుండగా.. ఒక రోజు ముందు గుండెపోటుతో రావడంతో గురువారం మృతి చెందారు. రాజోలు గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న ఆయన ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రానికి విధులు నిర్వర్తించేందుకు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. ఇంటికి కూతవేటు దూరం వెళ్లేసరికి పంచాయతీ రోడ్డులో ఛాతి బరువెక్కి తీవ్రమైన గుండె నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో స్థానికులు ఆయనను రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. రాజోలులో లీడింగ్ ఫైర్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ మూడు నెలల క్రితం పదోన్నతిపై ముమ్మిడివరం ఫైర్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. పోస్టుమార్టమ్ అనంతరం బాలకృష్ణ మృతదేహాన్ని స్వగ్రామం మామిడికుదురు మండలం కంచివారిపాలానికి తరలించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

బంగారు గొలుసు అపహరణ

అంబాజీపేట: శివరాత్రి పండగను పురస్కరించుకుని బుధవారం రాత్రి దైవదర్శనానికి వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకుని పోయాడు. గంగలకుర్రు అగ్రహారానికి చెందిన అరిగెల పద్మావతి స్థానిక శివాలయానికి దర్శనానికి వెళుతున్నారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడున్నర కాసుల బంగారు గొలుసును లాక్కొని పోయాడు. ఆమె బిగ్గరగా కేకలు వేసినప్పటికీ ఫలితం లేకపోయింది. బాధితురాలు పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ వి.సత్యనారాయణ తెలిపారు.

దొంగనోట్ల కేసులో లొంగుబాటు

అయినవిల్లి: దొంగనోట్ల కేసులో ఓ ముద్దాయి అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం లొంగిపోయాడు. ముద్దాయికి జడ్జి మహమ్మద్ రహ్మతుల్లా రిమాండ్ విధించారు. ఎస్సై కె.మనోహర జోషి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2022లో మండలంలో మాగంలో పలువురిపై దొంగనోట్ల కేసు నమోదైంది. వీరిలో ముగ్గురు ముద్దాయిలు గతంలో లొంగిపోగా రిమాండ్ విధించారు. నాలుగో ముద్దాయి అయిన కొప్పిశెట్టి కోటేశ్వరరావు గురువారం కోర్టులో లొంగిపోగా జడ్జి మహమ్మద్ రహ్మతుల్లా కోటేశ్వరరావుకు 14 రోజులు రిమాండ్ విధించారు. అయినవిల్లి పోలీసులు కోటేశ్వరరావును రాజమండ్రి సెంటర్ జైలుకు అప్పగించారు.

బడివడిగా ప్రయోగాలు

- శాస్త్రీయ దృక్పథం.. పరిశీలన.. పరిశోధనలకు మూలం
- సైన్స్‌కు పెద్దపీట వేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



జాతీయ స్థాయిలో పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న వన్నెచింతలపూడి పాఠశాల విద్యార్థులు (ఫైల్)

రాయవరం: మస్తిష్కాన్ని కదిలించాలి. . మెదడులో వినూత్న ఆలోచనలు ఉరకలెత్తించాలి.. కళ్లు నిశితంగా పరిశీలించాలి.. మనసులో జిజ్ఞాస మొదలవ్వాలి.. నవతరాన్ని ఆసక్తి నుంచి ఒక ఆశయం దిశగా నడిపించాలి.. ఇంతటి శక్తి కేవలం ఒక్క సైన్స్‌కు మాత్రమే ఉంది. శాస్త్రీయ ఆలోచనలతో అన్ని వయసుల వారికి, వారి స్థాయికి అన్వయించి జ్ఞానాన్ని అందించే శక్తి సైన్స్‌కు ఉంది. భారత శాస్త్రవేత్త సీవీ రామన్ ఎఫెక్ట్‌ను ప్రకటించిన రోజు ఫిబ్రవరి 28న ఏటా జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకునేలా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఎస్‌సీఈఆర్‌టీలు ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తున్నాయి. 'డిజైన్ థింకింగ్' పేరుతో నేటి యువతరం నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తోంది. పుస్తకాలతో కుస్తీ పడుతూ..మార్కుల వేటలో బిజీగా ఉంటూనే..మరోపక్క విద్యార్థులు పరిశోధనలకు ప్రాణం పోస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఎస్‌సీఈఆర్‌టీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలతో ప్రతి పాఠశాల ప్రయోగశాలగా మారుతోంది.

పాఠశాల దశ నుంచే..

పాఠశాల స్థాయి నుంచి సైన్స్ బోధన సాగుతోంది. కొన్నేళ్లుగా ఏపీ సమగ్ర శిక్ష ద్వారా పాఠశాలల్లో సైన్స్ పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2019 నుంచి అటల్ ఇన్నోవేషన్ మిషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 10వేల అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయగా, అందులో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 129 ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశారు. సమాజానికి సైన్స్ ఏ విధంగా ఉపయోగపడుతుంది..సమాజంలో ఉన్న ప్రశ్నలకు సైన్స్ సమాధానాలు ఎలా చూపిస్తుందో తెలియజేసేదే అటల్ టింకరింగ్ ల్యాబ్.

ప్రయోగాలతో మెరుస్తున్న కోనసీమ జిల్లా సైన్స్ విభాగం

- దక్షిణ భారత విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో కోనసీమ జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి పాల్గొన్న ఆరు ప్రాజెక్టుల్లో నాలుగు ప్రాజెక్టులు ఎంపిక కావడం గమనార్హం.
- జాతీయ స్థాయికి ఎంపికైన నాలుగు ప్రాజెక్టుల్లో మూడు ప్రాజెక్టులు మొదటి 30 స్థానాల్లో నిలిచాయి.
- నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో టాప్ 20లో ఏపీ నుంచి రెండు పాఠశాలలుంటే అందులో ఒకటి కోనసీమ జిల్లా నుంచి ఎంపిక కావడం విశేషం. 15 సంవత్సరాల అనంతరం నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ జాతీయ స్థాయి పోటీల్లో గెలవడం, అందునా కోనసీమ ఎంపిక కావడం విశేషం.
- 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో భాగంగా ఏపీ నుంచి 76 ప్రాజెక్టులు ఎంపిక కాగా, అందులో రెండు ప్రాజెక్టులు కోనసీమ జిల్లా నుంచి ఎంపికయ్యాయి. జెడ్పీహెచ్ఎస్ మోరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, రాజోలు పాల్గొన్నాయి.
- నేషనల్ సైన్స్ డే ప్రాథమిక స్థాయి విద్యార్థులకు నిర్వహిస్తున్నారు.

సైన్స్‌కు పెద్దపీట వేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు విద్యాశాఖ పెద్దపీట వేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను పాఠశాల స్థాయి నుంచే ఏర్పాటు చేశారు. పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో విద్యా,వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలకు శాస్త్రీయ దక్పథాన్ని జోడించి సరికొత్త పరిశోధనల వైపు విద్యార్థులు అడుగులు వేసేలా గత ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది. గత ప్రభుత్వం పాఠశాలలకు సైన్స్ కిట్స్‌ను అందజేసింది. గత ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అగస్త్య ఫౌండేషన్ వంటి పలు సంస్థలు సైన్స్‌కు ప్రాధాన్యత నిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అగస్త్య ఫౌండేషన్ ద్వారా సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు కూడా నిర్వహించారు. నిష్ఠ ద్వారా ప్రయోగశాలలను ఏ విధంగా వాడవచ్చన్న అంశంపై సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. గత ప్రభుత్వ హయాంలో సిమ్యులేషన్ విధానంలో ప్రయోగాలు ఎలా నిర్వహించవచ్చునో తెలియజేసేందుకు సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్, సైన్స్ ల్యాబ్స్, సైన్స్ సెమినార్లు, సైన్స్ డ్రామాల నిర్వహణకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేసింది. జిల్లా సైన్స్ అధికారుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు, ఇన్‌స్పైర్, చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తున్నారు. జిల్లా సైన్స్ అధికారి పాత్రను గత ప్రభుత్వ హయాంలోనే విస్తృత పరిచారు.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లా స్థాయిలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కోనసీమ జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. అయినవిల్లి మండలం చింతల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాల, కాట్రేనికోన మండలం పల్లాం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ప్రత్యేకంగా జిల్లా స్థాయి సైన్స్ పోస్టర్ ప్రజంటేషన్, సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. కపిలేశ్వరపురం మండలం మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'వికసిత్ భారత్ కోసం సైన్స్, ఆవిష్కరణలలో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారిత' అనే అంశంపై జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌ను నిర్వహిస్తున్నారు. వివిధ మండలాల నుంచి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొననున్నారు.

పాఠశాలే ప్రయోగశాల



ప్రతి వ్యక్తి జీవనానికి అవసరమైన పునాది పాఠశాలలో ప్రారంభమవుతుంది. ఈ దశ నుంచే ప్రతి విద్యార్థికి అవసరమైన ప్రయోగశాల పరిజ్ఞానం అందించే కృషి జరగాల్సి ఉంది. భవిష్యత్ ఆవిష్కరణ దిశగా వారిని నడిపించడానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలి.

– జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సైన్స్ ప్రాధాన్యం తెలియజేసేందుకు..



జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్ర శిక్షా ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటు సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నాం. సైన్స్ ప్రాధాన్యతను విద్యార్థి దశ నుంచే తెలియజేయడం దీని ముఖ్య ఉద్దేశం. పాఠశాల, మండల స్థాయిలో ఆన్‌లైన్ క్విజ్, జిల్లా స్థాయిలో ఆఫ్‌లైన్ క్విజ్‌ను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తాం. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను త్వరలో నిర్వహించబోయే సైన్స్ స్టడీ టూర్‌కు ప్రాధాన్యతనిచ్చే ఆలోచన చేస్తున్నాం.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈవో, అమలాపురం

మూడు రంగుల్లో పుచ్చకాయలు!



ముగ్గురూ మూడు రంగుల్లోని పుచ్చకాయల ముక్కలు తింటున్న చిన్నారులు

రామచంద్రపురం రూరల్: పైన పచ్చన, లోన ఎర్రన, నేనొక పండుని, ఎవరో చెప్పుకోండి అంటూ పుచ్చకాయల గురించి చిన్నారులకు బోధించే పాతాన్ని తిరగ రాయాల్సి ఉంటుందేమో ఈ పుచ్చకాయల సంగతి తెలిస్తే! వివరాల్లోకి వెళితే రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో పుచ్చకాయలు హోల్‌సేల్‌గా, రిటైల్‌గా అమ్మకాలు సాగించే ఆకుల రాంబాబు పసుపు రంగులో ఉండే పుచ్చకాయలను ప్రత్యేకంగా తెప్పించారు. ఆకస్మాత్తుగా చూసిన వారు పుచ్చకాయలతో పాటు దోసకాయలు కూడా అమ్ముతున్నారని అనుకుంటున్నారు. తీరా దగ్గరకు వెళ్లి చూస్తే అవి కూడా పుచ్చకాయలేనా.. అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇక అవి కోస్తే లోపల కొన్ని కాయలు పూర్తిగా పసుపు రంగులో ఉంటుండగా, మరికొన్ని కాయలు ఆరంజ్ రంగులో ఉండటంతో చిన్నారులు వీటిని తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

ఆర్గానిక్ పుచ్చకాయలు



పసుపు రంగులో ఉండే పుచ్చకాయలు త్రిపుర, కేరళ ప్రాంతాల నుంచి వస్తున్నాయని చెబుతున్నారు. వీటిని పూర్తిగా ఆర్గానిక్ పద్ధతుల్లో పెంచుతారట. కొంచెం ఖరీదు ఎక్కువైనా సరదాగా తెప్పించాం. రుచి కూడా చాలా బాగుండటంతో అందరూ, ముఖ్యంగా చిన్నారులు బాగా ఇష్టంగా తింటున్నారు.

– ఆకుల రాంబాబు, ద్రాక్షారామ

పోలీసులకే రక్షణ కరవు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి విమర్శ
- అనపర్తి సీఐపై దాడికి ఖండన



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాక్షస పాలనలో రక్షక భటులకే రక్షణ కరవైంది అంటూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం అనపర్తిలో స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్‌రెడ్డి, సుమేఘ వివాహ రిసెప్షన్ నిర్వహించారు. ఈ వేడుకకు అనపర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీఎల్‌వీకె సుమంత్ విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో అతనిపై మనోజ్‌రెడ్డి అనుచరులు దాడికి పాల్పడి గాయపరిచారు. ఈ ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కూటమి పాలనలో ఎన్నో అరాచకాలు, అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు రక్షక భటులుగా ఉండే పోలీసులపైనే అధికార పార్టీ నాయకులు, అనుచరులు దాడులకు పాల్పడి గాయపరిస్తే, పోలీసులే తమని తాము రక్షించుకోవడానికి ప్రయత్నాలు చేయాల్సి వస్తే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. సుమంత్‌పై దాడి చేసిన వారు మేము మనోజ్‌రెడ్డి మనుషులం, మమల్ని ఆపుతావా అని దాడికి పాల్పడ్డారంటే అధికార పార్టీ ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రజలు గ్రహించాలన్నారు. పట్టపగలే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు జరుగుతుంటే పట్టించుకోకుండా పోలీసులు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తున్నారు. అటువంటి పోలీసులపైనే అధికార పార్టీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ ఘటనను స్థానిక ఎమ్మెల్యే ఇప్పటి వరకు ఖండించపోవడాన్ని బట్టి పోలీసు వ్యవస్థకి ఏ పాటి గౌరవం ఇస్తున్నారో అర్థం అవుతోందన్నారు. కూటమి పాలనలో అనపర్తి నియోజకవర్గంలో గంజాయి, పేకాట, మద్యం మత్తులో అనేక అసాంఘిక కార్యక్రమాలు పెరిగాయన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం రామవరంలోనే పేకాట శిబిరం నిర్వహిస్తున్నారంటూ, ఆ పేకాట శిబిరానికి రూ.లక్ష ముడుపుగా ఎమ్మెల్యేకు అందిందని ఆరోపించారు. 2014–2019 కాలంలో పోలీసులపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్‌రెడ్డి అనుచరులు అనపర్తిలో ట్రైనీ ఎస్సైపై దాడికి పాల్పడి గాయపరిచారన్నారు. ఈ ఘటనపై పోలీసులు ఉన్నత స్థాయి అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి ఏ విధమైన చర్యలు తీసుకోలేదని వివరించారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, నియోజకవర్గం గ్రీవెన్స్ విశాగం అధ్యక్షుడు పడాల దుర్గాప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్, కర్రి గీతా, పందలపాక గ్రామకన్వీనర్ సత్తి హరి ప్రసాద్‌రెడ్డి, కర్రి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

4 నుంచి 'నన్నయ'లో నారీ ఫెస్ట్



వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వచ్చే నెల 4 నుంచి నారీ ఫెస్ట్ 2025 నిర్వహించనున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో మహిళలకు వివిధ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం విలేకరులకు తెలిపారు. మొదటి రోజు సెమినార్ హాల్లో హెల్త్ బేబీ పోటీలు, కన్వెన్షన్ సెంటర్‌లో బామ్మ-మనుమరాలి ఫ్యాషన్ షో జరుగుతుందన్నారు. హెల్త్ బేబీ పోటీలకు రాజమహేంద్రవరం పరిసరాలలోని ఐదేళ్లలోపు చిన్నారులు (ఆడ - మగ) పాల్గొనవచ్చన్నారు. వీటికి సంబంధించిన వివరాలకు 63057 89433 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు. బామ్మ-మనుమరాలు ఫ్యాషన్ షోలో పాల్గొనే బామ్మల వయస్సు 60 సంవత్సరాలు పైబడి ఉండాలని, మనుమరాలి వయసు ఐదు నుంచి పదేళ్ల వరకు ఉండవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.150 చెల్లించి, మార్చి 3లోగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వీటికి సంబంధించిన వివరాలకు 99126 62500 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

క్యాంపస్‌లోని మహిళల కోసం

అదే రోజు మహిళల కోసం ప్రత్యేక పోటీలు ఉంటాయని వీసీ తెలిపారు. యూనివర్సిటీతోపాటు తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలోని మహిళ విద్యార్థులు, సిబ్బంది వీటిలో పాల్గొనవచ్చన్నారు. గ్రూప్ సింగింగ్, ఫ్యాషన్ షో, స్కిట్, డాన్స్ వంటి పోటీలు ఉంటాయి. వీటిలో పాల్గొనే వారికి రిజిస్ట్రేషన్ ఫ్రీ అన్నారు. స్థానిక పాఠశాలలో కూడా పోటీలు నిర్వహించే అవకాశం ఉందన్నారు.

రెండో రోజు అనుబంధ కళాశాలల సిబ్బందికి పోటీలు

రెండోరోజు (మార్చి 5)న యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న గోదావరి జిల్లాలోని కళాశాలల సిబ్బందికి వివిధ పోటీలు ఉంటాయి. సృజనాత్మకతతో కూడిన వస్తువుల తయారీ (చేతి పనులు, చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ, పూల అలంకరణ వంటివి) పై పోటీలు జరుగుతాయి. పాల్గొనే వారు మార్చి 4లోగా రూ. 100 రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి, పేర్లు నమోదు చేయించుకోవాలి.

మూడో రోజు నారీ ఫెస్ట్ 2025

మూడో రోజు నారీ ఫెస్ట్ 2025లో భాగంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహిస్తామని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తెలిపారు. పై రెండు రోజులలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేస్తారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు యూనివర్సిటీ వుమెన్ సెల్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.


20 ప్రత్యేక రైళ్లు



రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల రద్దీని నివారించడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు 20 ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. చర్లపల్లి–కాకినాడ టౌన్, కాకినాడ టౌన్ – చర్లపల్లి మధ్య ఈ రైళ్లు నడవనున్నాయని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28, మార్చి 7, 13, 21, 28 తేదీల్లో (శుక్రవారం) సాయంత్రం 7:20 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరే నంబర్ 07031 ప్రత్యేక రైలు మరుసటి రోజు తెల్లవారు జామున 4:30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. మార్చి 2, 9, 16, 23, 31 తేదీల్లో (ఆదివారం) సాయంత్రం 6:55 గంటలకు కాకినాడ టౌన్ నుంచి బయలుదేరే నంబర్ 07032 ప్రత్యేక రైలు మరుసటి రోజు తెల్లవారు జామున 6:50 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైళ్లు రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వేస్టేషన్‌లలో ఆగనున్నాయని తెలిపారు.

నేత్రపర్వంగా భీమేశ్వరస్వామి రథోత్సవం





సామర్లకోటలో రథాన్ని లాగుతున్న భక్తులు, రథంపై వేంచేసిన బాలా త్రిపుర సుందరిదేవి, కుమారా రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి రథోత్సవం గురువారం నేత్ర పర్వంగా జరిగింది. ఈ నెల 24వ తేదీన జరిగిన స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకొని సాయంత్రం రథోత్సవం జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు ఈఓ బళ్ల నీలకంఠం, ఉత్సవాల ప్రత్యేకాధికారి కెవీ సూర్యనారాయణల ఆధ్వర్యంలో స్వామి వారిని అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయం నుంచి గాంధీచౌక్‌కు తీసుకొని వచ్చారు. ఆలయ పండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారిని అమ్మవార్లను పూలతోను, విద్యుత్తు దీపాలతో అలంకరణ చేసిన రథంపై ఉంచారు. రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మలబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబులు రథోత్సవాన్ని ప్రారంభించారు. పురవీధుల గుండా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సోమవారం రాత్రి స్వామి వారి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

పులకించిన పీఠికాపుర వీధులు



పిఠాపురంలో కుక్కుటేశ్వరస్వామి వారి రథోత్సవానికి పోటెత్తిన భక్తులు



పిఠాపురంలో కుక్కుటేశ్వరస్వామి వారి రథోత్సవం

పిఠాపురం: గరళ కంఠుడి రథ చక్రాల ఘట్టనలతో పీఠికాపురం పులకించి పోయింది. ఆది దేవుడు కైలాసం నుంచి భువికి దిగి వచ్చాడా అన్నట్టుగా భక్త జనం బారులు తీరి పుర వీధుల్లో నిర్వహించిన ఉమా కుక్కుటేశ్వరస్వామి వారి దివ్య రథోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. తెల్లవారుజామున పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పేరున ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో లింగోద్భవ పూజలు, అభిషేకాలు, తొలి అర్చన చేశారు. భక్త జన సందోహం నడుమ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాల అనంతరం ఆలయం నుంచి పల్లకిలో ఊరేగింపుగా కుంతీ మాధవస్వామి వారి ఆలయం వద్ద ఉన్న స్వామివారి రథం వద్దకు తీసుకెళ్లారు. బ్యాండుమేళాల నడుమ విద్యుద్దీపాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించిన రథంపై పట్టు వస్త్రాలు, నగలతో అలంకరించిన ఉత్సవ విగ్రహాలను రథంపై అధిష్టింప చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు కొనసాగిన రథోత్సవానికి అశేష భక్త జనవాహిని కదిలి వచ్చింది. భక్తులు రథాన్ని లాగి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.